నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 4 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

పత్తి ఏరేందుకు కూలీల కొరత

తాంసి(భీంపూర్), నవంబర్ 3 : భీంపూర్ మండలంలో పత్తి ఏరేందుకు కూలీల కొరతతో రైతులు సతమతమవుతున్నారు. చేలన్నీ నిండుగా ఉండడం, వర్షం వస్తే తడిసి ధర తగ్గుతుందనే ఆందోళనతో రైతులు పత్తిని ఏరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం రూ.8 నుంచి 10 వరకు ఒక కిలో పత్తి ఏరితే ఇస్తుండగా ఒక్కో మహిళా కూలీ సగటున 80 నుంచి 100 కిలోల వరకు ఏరుతున్నారు. ఈ లెక్కన ఒక్కో కూలీకి రూ.1000 చొప్పున చెల్లింపు చేయాల్సి వస్తున్నదని పెద్ద రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో శనివారం దీపావళి ఉన్నందున ఈ పండుగ తర్వాత వలస కూలీలు మండల గ్రామాలకు రానున్నారు. అప్పటి వరకు గ్రామాల్లో కూలీల కొరత ఉంటుందని రైతులంటున్నారు.

కమ్మేసిన పొగమంచు..

బోథ్ మండలంలో ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. సూర్యోదయం అయినా దట్టంగా పొగమంచు వ్యాపించి ఉంది. లైట్లు వేసుకొని వాహనాలను నడపాల్సివచ్చింది. మరోవైపు పొగమంచుతో కోత దశలో కంది, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం నెలకొన్నదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

-బోథ్, నవంబర్3

బోథ్ మండలం కేంద్రాన్ని కమ్ముకున్న పొగమంచు

జాతీయ అవార్డులు రావడం అభినందనీయం

- బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యులకు సన్మానం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 3 : 13 ఏండ్లుగా రక్తదానం చేస్తూ జాతీయ స్థాయిలో జిల్లా కేంద్రంలోని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు జాతీయ స్థాయి అవార్డులు తీసుకోవడం గర్వకారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో యంగ్ ఇండియన్ సేవా పురస్కార్-2024 అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆదివారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి జోగురామన్న సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో రక్తం అవసరమున్న వారికి బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. వీరి సేవలకు గాను యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాజిదొద్దీన్, రోకండ్ల రమేశ్, జగదీశ్, బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శ్రీకాంత్, ఆశిష్, ఆసిఫ్, మహేందర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఏఎస్పీ అవినాశ్ కుమార్

క్రికెట్ ఆడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా, నవంబర్ 3 : క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా పోటీల్లో రాణించిన వారి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ కోటా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడడంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలన్నారు. ఇందులో బబ్రు మహరాజ్, బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్, డా. రామకృష్ణగౌడ్, మున్నా లడ్డా, ఓం లడ్డా, శంకర్ చంద్రే తదితరులు ఉన్నారు.

ఫోర్జరీ పత్రాలు సృష్టించిన ఐదుగురిపై కేసు

- ఇద్దరు రిమాండ్, ముగ్గురు పరారీ
- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఎదులాపురం, నవంబర్ 3 : ఫోర్జరీ చేసి డీటీసీపీ అప్రూవల్ ఉన్నట్లు పత్రాలు సృష్టించి ప్లాట్లు విక్రయించిన ఐదుగురిపై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం డీఎస్పీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ కే ఫణింధర్, ఎస్ఐ ముజాహిద్‌తో కలిసి డీఎస్పీ వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని రణదివ్యనగర్‌లో సర్వే నంబర్ 64/2/3/2లో కొంత మంది అనుమతులు లేకుండా లే అవుట్ వేసి ప్లాట్లు విక్రయించారన్నారు. కొన్ని ప్లాట్లు సైతం రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిపారు. ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తికి అనుమానం రావడంతో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విషయం తెలిసిందన్నారు. ఈ మేరకు సబ్ రిజిష్టర్ బీ ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన (ఏ1) ఎండీ అజీమ్, (ఏ2) ఎండీ క్యూమేని అహ్మద్, (ఏ3) ఆనంద్‌కుమార్ సమ్నాని, (ఏ4) ఎండీ నవీద్, (ఏ5) ముషీర్ ఖాన్‌పై చీటింగ్, ఫోర్జరీతో పాటు వివిధ సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం (ఏ1) ఎండీ అజీమ్, (ఏ2) ఎండీ క్యూ మేని అహ్మద్ రిమాండ్ చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు పత్రాలను సరి చూసుకొని కొనుగోలు చేయాలని ప్రజలకు డీఎస్పీ తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

మృతదేహం పూడ్చిన చోట తవ్వుతున్న సిబ్బంది

నాందేవ్(ఫైల్)

ఎదులాపురం, నవంబర్ 3 : పూడ్చిన మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ సీహెచ్ కరుణాకర్‌రావ్ వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన రావుత్ నాందేవ్(38) మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మహజల్ గావ్ తాలూకాలోని తెల్గాం గ్రామంలోని లక్ష్మీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో పని చేసేందుకు గత నెల 25న తన కుమారుడు అంకుష్, భగత్ సింగ్ నగర్‌కు చెందిన మిథున్, సుధామ్‌తో కలిసి వెళ్లాడు. అక్కడ మిథున్‌తో రావుత్ నాందేవ్‌కు గొడవ జరిగింది. వీరంతా అక్టోబర్ 30న ఇంటికి తిరిగి వచ్చారు. తండ్రి కొడుకులు భోజనం చేసి ఇంట్లో నిద్రపోయారు. మరుసటి రోజు అక్టోబర్ 31న ఉదయం నాందేవ్‌ను భార్య రాజేశ్వరి నిద్ర లేపగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సాధారణ మృతిగా భావించి అదే రోజు వడ్డెర కాలనీ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేసి ఖననం చేశారు. మహారాష్ట్ర జిన్నింగ్ మిల్లులో జరిగిన గొడవ విషయాన్ని కొడుకు అంకుష్ తల్లి రాజేశ్వరికి ఈ నెల 2న చెప్పాడు. దీంతో ఆమె టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మృతిపై అనుమానాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నది. దీంతో ఆదివారం శ్మశాన వాటికలో పూడ్చి పెట్టిన మృతదేహాన్ని బయటికి తీసి అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో, టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్, వైద్యులు అక్షయ్ రెడ్డి, అంకిత్ రావ్, పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు జీరో ఎఫ్ ఐఆర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్వీయ విజి 'లెన్స్'

- చేతులెత్తేసిన సర్కారు
- కరువైన తనిఖీలు.. పర్యవేక్షణ
- ఇదే అదునుగా తీసుకుంటున్న అక్రమార్కులు
- మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతి
- జోరుగా పట్టుబడుతున్న బోగస్ మక్క విత్తనాలు

నకిలీ విత్తనాలను పసిగట్టి పట్టుకుంటున్న రైతులు

నర్సాపూర్ మండలం అర్లి ఎక్స్‌రోడ్డు వద్ద రైతులు పట్టుకున్న నకిలీ మక్క విత్తనాలు (ఫైల్)

నిర్మల్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలో మళ్లీ నకిలీ విత్తనాల కలకలం మొదలైంది. గతేడాది క్రితం వరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు, పకడ్బందీగా పర్యవేక్షించడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. విత్తనాల నాణ్యతపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అవగాహన పాటు శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించింది. జిల్లాకు సుదీర్ఘ సరిహద్దు ఉన్న మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాల సరఫరా కాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ నకిలీ విత్తనాల ప్రహసనం మొదలైంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, నిఘా లోపాన్ని ఆసరా చేసుకుంటున్న కొంతమంది నకిలీ విత్తన వ్యాపారులు పెద్ద ఎత్తున విత్తనాలను తరలించి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి.. నకిలీ మక్క విత్తనాలను ఇప్పటికే జిల్లాలోని పలు మండలాలకు చెందిన రైతులకు పెద్ద ఎత్తున విక్రయించినట్లు ఫిర్యాదులున్నాయి. ఇందుకు అనుగుణంగా శనివారం రాత్రి నర్సాపూర్(జీ) మండలంలోని అర్లి ఎక్స్ రోడ్డు వద్ద రైతులే స్వయంగా నకిలీ విత్తనాలను పట్టుకొని స్వీయ విజిలెన్స్ విధానానికి తెరలేపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నకిలీ విత్తనాలపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పుడు ఫలితాలనిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వ శిక్షణ ద్వారా నకిలీ విత్తనాల విషయంలో అవగాహన పెంచుకున్న రైతులు శనివారం జిల్లాకు చేరుకున్న నకిలీ విత్తనాలను అప్పటికప్పుడే గుర్తించి, వాటిని విక్రయించే వ్యక్తిని పట్టుకోవడం రైతుల చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. పయోనీర్ బ్రాండ్ పేరుతో ఉన్న విత్తనాలను పరిశీలించిన రైతులు.. సంచులపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగా వివరాలు సక్రమంగా లేకపోవడంతో అవి నకిలీవని గుర్తించారు. పట్టుకున్న విత్తనాల సమాచారాన్ని రైతులు వెంటనే అటు వ్యవసాయశాఖ అధికారులకు, ఇటు పోలీసులకు చేరవేశారు. రైతులు ఫిర్యాదు చేసేవరకు రంగంలోకి దిగని వ్యవసాయ అధికారులు.. సంఘటనా స్థలానికి చేరుకొని విత్తనాల ప్యాకింగ్‌ను, వాటి నాణ్యతను పరిశీలించి అవి నకిలీవని తేల్చారు. దీంతో సదరు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతి..

జిల్లాకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర నుంచి కొద్ది రోజులుగా జిల్లాకు వివిధ రకాల పంటల నకిలీ విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మొదటి నుంచి మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు పత్తి, మక్క, సోయా తదితర విత్తనాలను అక్రమంగా సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. తక్కువ ధర ఆశ చూపి మారుమూల పల్లెల్లో ఈ నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టడం. ఆ తర్వాత విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళనలకు దిగడం అప్పట్లో సర్వసాధారణంగా జరిగేది. గత బీఆర్ఎస్ సర్కారు తీసుకున్న చర్యల కారణంగా పదేళ్లుగా నకిలీల ఆటలకు అడ్డుకట్ట పడ్డది. ఏడాది క్రితం వరకు జిల్లాకు నకిలీ విత్తనాల సరఫరా జరగలేదు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా సారించడంతో పాటు, విత్తన వ్యాపారులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయడం, విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేయడం లాంటి చర్యలతో నకిలీ విత్తన విక్రయ దందా పూర్తిగా నిలిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ విత్తనాలు, ఎరువులు, ఇతర రైతు అవసరాలపై సరైన నిఘా సారించకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. సర్కారు తీరును, అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకున్న నకిలీ విత్తన విక్రయదారులు మళ్లీ చెలరేగిపోతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కొందరు అక్రమార్కులు జిల్లాకు భారీ ఎత్తున నకిలీ విత్తనాలను సరఫరా చేస్తూ ఇక్కడి రైతులను నట్టేట ముంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫలిస్తున్న 'బీఆర్ఎస్' శిక్షణ కార్యక్రమాలు

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నకిలీ ఎరువులు, విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పుడు ఫలిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అప్పట్లో రైతు వేదికల ద్వారా ప్రతి 15 రోజులకోసారి సమావేశాలు నిర్వహించి వ్యవసాయాధికారులు ఎరువులు, విత్తనాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేవారు. దీంతో రైతులు ఏది నకిలీ ఏది అసలు అనే విషయాన్ని తెలుసుకునే స్థాయికి చేరుకున్నారు. ఇందులో భాగంగానే జిల్లాకు సరఫరా అవుతున్న నకిలీ విత్తనాలను రైతులే స్వయంగా పసిగట్టి వారే అధికారులకు, పోలీసులకు సమాచారాన్ని చేరవేశారంటే వారి చైతన్యానికి ఈ సంఘటన నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పుడు ఫలితాలిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి

యాసంగి సీజన్‌కు సంబంధించి విత్తనాల కోసం దళారులను రైతులు ఆశ్రయించకుండా, లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లును తీసుకొని భద్రపర్చుకోవాలి. మహారాష్ట్ర లోని పాలజ్ ప్రాంతం నుంచి నకిలీ మక్క విత్తనాలను జిల్లాకు తీసుకొచ్చిన చందుల మహేశ్ అనే వ్యక్తిని పోలీసులకు అప్పగించాం. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా గ్రామాలకు వచ్చి తక్కువ ధరకు విత్తనాలను విక్రయిస్తే అలాంటి వారి సమాచారాన్ని సమీపంలోని వ్యవసాయాధికారులకు అందజేయాలి.

-అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నిర్మల్

నాణ్యమైన విత్తనాలందించడమే లక్ష్యం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

తాంసి : జామిడిలో విత్తనాల సంచులను పరిశీలిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

తాంసి, నవంబర్ 3 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జామిడి గ్రామ వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించారు. అంతకుముందు రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించారు. కావాల్సిన విత్తనాలు, చేపట్టాల్సిన చర్యలపై రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. విత్తనాభివృద్ధి సంస్థలో పురోగతి సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు వినోద్ రెడ్డి, జామిడి వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కేశవ్ రెడ్డి, ఎం అశోక్, నాయకులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, కౌడల సంతోష్, కౌడల నారాయణ రూపేశ్ రెడ్డి, రాష్ట్ర సీడ్స్ మార్కెటింగ్ మేనేజర్ రాజీవ్, ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ అతుల్ జైన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

బోథ్, నవంబర్ 3 : యాసంగిలో సాగు కోసం నాణ్యమైన శనగ విత్తనాలు అన్ని ఆగ్రోస్ సెంటర్లలో అందుబాటులో ఉంచామని, ప్రైవేట్ కంపెనీల ఉచ్చులో పడి రైతులు మోసపోవద్దని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఆగ్రోస్ సెంటర్‌ను సందర్శించారు. దళారులను నమ్మకుండా ప్రత్యక్షంగా రైతులతోనే ఒప్పందం చేసుకొని లాభాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తెలంగాణ సీడ్స్ రీజియన్ మేనేజర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

బజార్‌హత్నూర్ నవంబర్ 3 : బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం, పలు ఫర్టిలైజర్ దుకాణాలను రాష్ట్ర విత్తానాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందజేయాలని డీలర్లకు సూచించారు. అంతకు ముందు పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, సీఈవో నారాయణగౌడ్ శాలువాతో సత్కరించారు. ఇటీవల గాయాలపాలైన కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కె పాండు రంగ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సయ్య, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, సొసైటీ డైరెక్టర్లు చట్ల వినిల్, నాయకులు శివుడు, విఠల్, తదితరులున్నారు.

సూర్యాపూర్‌లో పెద్దపులి సంచారం

- ఓలా బీట్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టిన అటవీ శాఖ అధికారులు

సూర్యాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కుంటాల, నవంబర్, 3 : కుంటాల మండలంలోని ఓలా బీట్ పరిధిలో సూర్యాపూర్ అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా పులి అలజడి ఉండగా ఆదివారం మళ్లీ సంచరించడం స్థానికంగా కలకలం రేపింది. పశువుల కాపరులు రాములు, చిన్నయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గేదెలను మేతకు తీసుకెళ్లి నీళ్లు తాగించేందుకు అటవీ ప్రాంతంలోని చెరువు వైపు వస్తుండగా ఓ గేదెను దాడి చేసేందుకు పులి యత్నించింది. గమనించిన పశువుల కాపరులు కేకలు వేయగా పారిపోయింది. ఒకరు చెట్టు ఎక్కగా, మరొకరు దూరంగా పరిగెత్తి ప్రాణాలను కాపాడుకున్నారు. అనంతరం గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గ్రామస్తులు వచ్చి వారిని ఇంటికి తీసుకొచ్చారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా భైంసా ఎఫ్ఆర్వో వేణుగోపాల్ నేతృత్వంలో ఎఫ్ఎస్వోలు లక్ష్మణ్, కీర్తి, డీఆర్వో శంకర్, ఈబీవో గ్రామస్తులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పులి పాదముద్రలను వెతికారు. గతంలో పులి దాడిలో గాయపడ్డ గేదె దూడ ఆదివారం చనిపోయిందని బాధిత రైతు సబ్బని లక్ష్మణ్ తెలిపాడు. తగిన నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరాడు.

కార్తీకం.. శుభప్రదం

- కార్తీక పూజలకు కేరాఫ్ గూడెం గుట్ట
- ఆలయం వద్ద నెలంతా భక్తుల సందడి
- సత్యనారాయణస్వామి వ్రతాలకు నెలవు
- ప్రారంభమైన కార్తీక మాసం



గూడెంలోని గుట్టపై వెలిసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం

కార్తీక మాసం అంటేనే పూజలు, శుభకార్యాలు, వ్రతాలకు ప్రత్యేకం. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మరి కొందరు నదీ స్నానాలు, ఆలయ దర్శనాలు చేస్తుంటారు. వాటన్నింటిని ఒకే చోట పొందేందుకు కార్తీక మాస పూజల కోసం దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట వేదికవుతుంది. ఇక్కడ వెలిసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులవుతారు. ఈ మాసంలో తులసి పూజను దైవరూపంగా భావిస్తారు. ఈ మొక్కను పూజిస్తే సకల దోశాలు, పాపాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం.

-దండేపల్లి, నవంబర్ 3

గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో ఉన్న ఆలయాల్లో శనివారం నుంచి కార్తీక సందడి ప్రారంభమైంది. గూడెం గ్రామంలో ఉన్న శ్రీసత్యనారాయణస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి దేవస్థానం, శనేశ్వరాలయం, సదానందస్వామి ఆలయాలు కార్తీక మాసంలో భక్తుల రద్దీతో సందడిగా మారనున్నాయి. గూడెం గుట్టకు అతి సమీపంలోనే పవిత్ర గోదావరి ప్రవహిస్తుండడంతో భక్తుల తాకిడి పెరుగుతూ ఉంటుంది. కరీంనగర్-జగిత్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆలయాలు ఉండడంతో పుణ్య క్షేత్రాలకు శోభ చేకూరుతుంది. కార్తీక మాసంలో మహిళలు పూజలు చేసి వ్రతాలు, నోములు, ఆచరిస్తారు. కార్తీక దీపారాదనకు ప్రాధాన్యత ఉంది.

నెలంతా భక్తుల సందడి

తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ప్రతినిత్యంతోపాటు కార్తీక మాసంలో రెట్టింపు సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దీంతో ఈ మాసంలో ఆలయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయానికి కొద్ది దూరంలోనే పవిత్ర గోదావరి ప్రవహిస్తుండడంతో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేస్తుంటారు. సత్యదేవుని దర్శనం, అభిషేక పూజలు చేస్తుంటారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలతోపాటు, స్వామివారి సన్నిధికి సమీపంలో ఉన్న రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తుంటారు. కార్తీక పౌర్ణమి రోజున ఆలయంలో పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు.

అయ్యప్ప, సాయిబాబా ఆలయాలు

సత్యదేవుని ఆలయ సమీపంలో మరో గుట్టపై ఆలయం, గుట్ట కింద సాయిబాబా ఆలయం ఉంది. అయ్యప్ప దీక్షలు కూడా ఈ మాసంలోనే ప్రారంభం అవుతాయి. కాబట్టి దీక్ష తీసుకునే వారు కూడా చాలా మంది అయ్యప్ప ఆలయానికి వచ్చి మాలధారణ చేసుకుంటారు. కార్తీక మాసంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో సందడి నెలకొని ఉంటుంది.

కార్తీక మాసం ప్రత్యేక పూజలు

రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 15 వరకు కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 13న విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ఠ, నిత్యవహనము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, గోధూళిక సుముహూర్తాన తులసీ కల్యాణం 14న నిత్యహవణము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, 15న నిత్యహవణం, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, కార్తీక పౌర్ణమి జాతర, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మహా పూర్ణాహుతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.